
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 1 ఆగస్టు 2024

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మేరకు పదవుల పందేరానికి ముహూర్తం సమీపిస్తోంది. కూటమి పార్టీల అధిష్ఠానాలు ఎంపిక ప్రక్రియపై కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కష్టపడి పనిచేసిన నాయకులు, క్రియాశీలక కార్యకర్తల వివరాలను సేకరిస్తున్నాయి. ఆగస్టు మొదటి వారం తర్వాత విడతల వారీగా నామినేటెడ్ పదవులు భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఆగస్టు నెలాఖరులోపు సాధ్యమైనంత వరకూ మొత్తం పదవులు భర్తీ చేసే అవకాశం వుంది. దీంతో జిల్లాలో ఆశావహుల ప్రయత్నాలు జోరందుకున్నాయి. రెండేళ్ళ తర్వాత పరిస్థితులు ఎలా వుంటాయోనని తొలి విడతలోనే ఛాన్సు కొట్టేయాలని ఆశావహులు ఆరాటపడుతున్నారు. దీంతో చివరి ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వీరీ.. వీరీ.. గుమ్మడి పండూ..

వీరికే పదవి?

ఈ నెలలోనే నామినేటెడ్ పదవుల పందేరం

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

కష్టపడిన వారిని గుర్తిస్తున్న అధిష్ఠానాలు

కూటమి పార్టీల అధిష్ఠానాలు నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయి. టీడీపీ విషయానికొస్తే నియోజకవర్గం నుంచీ వందమంది పేర్లను అప్‌లోడ్ చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. ఆ మేరకు ఇప్పటికే జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచీ 80 వరకూ పేర్లు అధిష్ఠానానికి అందాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు జిల్లావ్యాప్తంగా 100-150 పేర్లు పంపించాల్సి వుంది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి కష్టపడిన వారి జాబితా అప్‌లోడ్ చేసే బాధ్యత కూడా జిల్లా అధ్యక్షుడికే అప్పగించినట్టు సమాచారం. ఇప్పటి వరకూ తిరుపతి నుంచీ 90 పేర్లు అప్‌లోడ్ అయ్యాయని చెబుతున్నారు. జనసేన పార్టీలో కూడా ఇదేరకమైన వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఈ పేర్లు ముందుపెట్టుకుని వారి స్థాయిని బట్టి స్థానికంగా ఆలయ కమిటీల్లో సభ్యులుగా, ఛైర్‌పర్సన్లుగా, మార్కెట్ కమిటీలలో డైరెక్టర్లుగా, ఛైర్‌పర్సన్లుగా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్లలో డైరెక్టర్, ఛైర్‌పర్సన్ పోస్టులకు ఎంపిక చేయనున్నారు.

అందరి గురీ టీటీడీ, తుడాలపైనే!

టీటీడీ బోర్డు ఛైర్మన్, మెంబరు పదవులపైన, తుడా ఛైర్‌పర్సన్ పదవిపైనా ఎక్కువమంది ఆశావహులు గురి పెడుతున్నారు. టీటీడీ ఛైర్మన్ పదవి రాష్ట్రస్థాయిలో కీలకం కావడంతో జిల్లానుంచీ ఒకరిద్దరు మాత్రమే ఆశిస్తున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ తాను గతంలో తుడా ఛైర్మన్‌గా పనిచేసినందున ఈ పర్యాయం టీటీడీ ఛైర్మన్ పదవి ఇవ్వాలని, తిరుపతి ప్రాంత యాదవులతో శ్రీవారి ఆలయానికి వున్న అవినాభావ సంబంధాన్ని దృష్టిలో వుంచుకుని తనకు అవకాశం కల్పించాలని గట్టిగా కోరుతున్నారు. తన వయసు దృష్ట్యా రాజకీయంగా ఇదే తనకు చివరి అవకాశమని గుర్తు చేస్తున్నారు. టీటీడీ ప్రయోజనాల కోసం పోరాడిన నేపథ్యం కలిగిన తనను ఛైర్మన్‌గా నియమించాలని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి అభ్యర్థిస్తున్నారు. వీరిద్దరే బాహాటంగా టీటీడీ ఛైర్మన్ పదవి కోరుతున్నారు.

టీటీడీ మెంబరు కోసం 300 దరఖాస్తులు

టీటీడీ బోర్డు మెంబరు పదవి కోసం రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబుకు ఇప్పటి వరకూ 300 దరఖాస్తులు అందినట్టు సమాచారం. మూడు పార్టీలతో కూడిన కూటమి ప్రభుత్వం కావడం వల్ల చంద్రబాబుపై టీటీడీలో మెంబరు పదవుల కోసం మూడు పార్టీల నుంచీ విపరీతమైన ఒత్తిడి వుంది. 24 మందిని మాత్రమే నియమించే వీలున్నందున ఆశావహులను వడపోయడం సంక్లిష్టంగా మారిందని సమాచారం. జిల్లాకు లేదా తిరుపతికి కనిష్టంగా ఒకటి లేదా గరిష్టంగా రెండు మెంబరు పదవులకు మించి కేటాయించే అవకాశం లేదు. ఒత్తిడి ఎక్కువైతే ఒక్కటి కూడా ఇవ్వకపోయినా ఆశ్చర్యపడాల్సిన పని లేదు. జిల్లా నుంచీ బోర్డు మెంబరు కావాలని చాలామంది ఆశిస్తున్నారు. టీడీపీ నుంచీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, హేమాంబరధర రావు, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్ తదితరులు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అలాగే జనసేన నుంచీ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ ఈ పదవి కోసం రేసులో వున్నారు. బీజేపీ నుంచీ ఛైర్మన్ పదవి రాకపోతే మెంబరు పదవి ఇవ్వాలని భానుప్రకాష్‌రెడ్డి కోరుతుండగా సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్ పేర్లు కూడా పరిశీలనలో వున్నాయి. వీరిలో పలువురు గత ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు. అలాగే కొందరు తమ పార్టీల కోసం కష్టకాలంలో ఆర్థిక భారం కూడా వహించారు.

తుడా ఛైర్మన్ పదవికి పలువురు ఆశావహులు

టీటీడీలో ఎక్స్ అఫిషియో మెంబరు హోదా కలిగిన తుడా ఛైర్మన్ పదవిని సైతం పలువురు నేతలు ఆశిస్తున్నారు. బ్రహ్మాండమైన కార్యాలయం, సిబ్బంది, వనరులు, క్యాబినెట్ హోదా కలిగిన పదవి కావడంతో ఈ పదవికి క్రేజ్ పెరిగింది. ఈ పదవికి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, చంద్రగిరి నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధా యాదవ్, తిరుపతి నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రవినాయుడు తనకు అవకాశం ఇస్తే సామాన్య కార్యకర్తను గుర్తించినట్టు అవుతుందని, యువతను ప్రోత్సహించినట్టు అవుతుందని చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ళూ కష్టపడి పనిచేశానని, యువగళం పాదయాత్రలోనూ, అలాగే అధినేత సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమంలోనూ వెన్నంటి నడిచానని చెబుతున్నారు. బడి సుధా యాదవ్ చంద్రగిరి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించగా దివాకర్‌రెడ్డి శ్రీకాళహస్తి, చంద్రగిరిల్లో పార్టీ కోసం పనిచేశారు. దేవనారాయణరెడ్డి తిరుపతి, చంద్రగిరి సెగ్మెంట్లలో పార్టీ కోసం పనిచేశారు. వీరిలో రవినాయుడు, సుధా యాదవ్, దేవనారాయణరెడ్డి పార్టీ కోసం పలు పోలీసు కేసులు, వేధింపులు ఎదుర్కొన్నారు. జనసేన నుంచీ హరిప్రసాద్, కిరణ్ రాయల్ టీటీడీ బోర్డు మెంబరు కాకుంటే తుడా ఛైర్మన్ పోస్టు అయినా దక్కుతుందని ఆశిస్తున్నారు. వారిలో కిరణ్ రాయల్ గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు.

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

నామినేటెడ్ పోస్టుల భర్తీకి సమయం సమీపించడంతో ఆశావహుల యత్నాలు జోరందుకున్నాయి. పలువురు నేరుగా తమ పార్టీల అధినేతలను కలుస్తున్నారు. ఆయా పార్టీల కోసం తాము అందించిన సేవలను గుర్తు చేస్తూ, పార్టీల కోసం తాము పడిన కష్టాలను ఏకరువు పెడుతున్నారు. తమకు ఫలానా పదవి కావాలని కొందరు సూటిగా ప్రస్తావిస్తుండగా మరికొందరు ఫలానా పదవి ఇవ్వాలని అది లేకుంటే ప్రత్యామ్నాయంగా ఫలానా పదవి ఇవ్వాలని అధిష్ఠానాల ఎదుట ప్రతిపాదనలు పెడుతున్నారు. కొందరైతే ఏ పదవి ఇచ్చినా పర్వాలేదని అధిష్ఠానాలకే వదిలి పెడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా పార్టీ పదవులు

ప్రభుత్వ నామినేటెడ్ పదవుల కోసం పోటీ పెరిగిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పదవులు తెరపైకి వస్తున్నాయి. టీడీపీలో జిల్లా పార్టీ అధ్యక్ష పదవి, తిరుపతి అసెంబ్లీ ఇంచార్జి పదవులతో ఇద్దరిని సమాధానపరిచే అవకాశం కనిపిస్తోంది. అధికారంలో వున్నందున పార్టీ పదవులు తీసుకునేందుకు కొందరు సిద్ధంగా వున్నారు. అయితే వట్టి పార్టీ పదవులే అయితే తమకు అధికారులు విలువ ఇవ్వరని, ఏదో ఒకటి ప్రోటోకాల్ పదవి కూడా అనుబంధంగా ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. ఇదే పరిస్థితి జనసేన పార్టీలోనూ కనిపిస్తోంది. ఆశావహుల్లో ఎవరో ఒకరిని జిల్లా అధ్యక్ష పదవితో సంతృప్తిపరిచే అవకాశముంది.

జిల్లాలో భర్తీకి అవకాశం వున్న పదవులు ఇవీ!

జిల్లాలో టీటీడీ ట్రస్టు బోర్డు ఛైర్మన్, బోర్డు మెంబర్లు, తుడా ఛైర్‌పర్సన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు కీలకమైనవి. ఇందులో టీటీడీ ఛైర్మన్ నిస్సందేహంగా రాష్ట్రస్థాయి పదవి. తుడా ఛైర్‌పర్సన్, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు క్యాబినెట్ ర్యాంకు కలిగినవే అయినా వాటిని జిల్లాస్థాయి పదవులుగానే పరిగణించే పరిస్థితి. తర్వాత కేటగిరీలో , ముక్కంటి, చెంగాలమ్మ, సురుటుపల్లి, వెంకటగిరి పోలేరమ్మ, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తదితర ముఖ్య ఆలయాల పాలక మండళ్ళు జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ పదవులున్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండళ్ళు వున్నాయి. ముక్కంటి ఆలయం మొదలుకుని ఇవన్నీ స్థానిక ప్రాధాన్యత కలిగిన పదవులు. ఇవి కాకుండా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు, వాటిల్లో డైరెక్టర్ పదవులు కూడా కొన్ని జిల్లాకు దక్కే అవకాశముంది. వివిధ అకాడమీలు, వక్ఫ్ బోర్డు, హజ్ కమిటీ, మహిళ, ఎస్సీ, మైనారిటీ కమిషన్ల ఛైర్‌పర్సన్ పదవులు, వాటిలో డైరెక్టర్ పదవులు వంటికి కూడా కొన్ని జిల్లా నేతలకు దక్కవచ్చు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



వైసీపీ నేతల లీలలపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వండి

- ఆర్సీపురంలో రూ.కోటి స్థలం స్వాహాపై సీసీఎల్‌కు రెవెన్యూ మంత్రి కార్యదర్శి లేఖ
- ఇరువర్గాల వాదనలు విన్న ఆర్డీవో

తిరుపతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలంలోని భూవివాదంపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కార్యదర్శి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ)కు బుధవారం లేఖ రాశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత నెలరోజులుగా భూ కబ్జాలపై ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల్లో ప్రచురితమైన కథనాలను జతచేస్తూ సీసీఎల్ఏకు రెవెన్యూ శాఖ కార్యదర్శి లేఖరాశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 9 భూవివాదాల వార్తలుండగా అందులో రామచంద్రాపురం మండల పరిధిలోని భూమికి తిరుపతి రూరల్ తహసీల్దార్ ధృవీకరించినట్టు నకిలీ రికార్డు తయారు చేసిన వైసీపీ నేతల వ్యవహారంపై ప్రచురించిన కథనం కూడా ఉంది. మూడు రోజుల్లో సీసీఎల్ఏ ఇచ్చిన నివేదిక ఆధారంగా తగు చర్యలను రాష్ట్రప్రభుత్వం తీసుకోనుంది. ఇదిలావుంటే బుధవారం ఆర్డీవో నిశాంత్ రెడ్డి ఇరువర్గాలను పిలిచి విచారణ చేపట్టారు. బాధితుడు కె.పురుషోత్తమ రెడ్డితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ద్రాక్షాయణి భర్త చిరంజీవుల రెడ్డి, వైసీపీ జడ్పీటీసీ డిల్లీరాణి హాజరయ్యారు. అయితే 1959 నుంచి పురుషోత్తం రెడ్డి దగ్గర ఉన్న డాక్యుమెంట్లను ఆర్డీవోకు సమర్పించగా, చిరంజీవుల రెడ్డి, డిల్లీరాణి ఆర్డీవో అడిగిన డాక్యుమెంట్లు సమర్పించలేకపోయినట్టు తెలిసింది.

నేడు పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను గురువారం ఉదయం 6గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అందజేయనున్నారు.జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మొత్తం 2,67,772మంది పింఛనుదారులున్నారు.5,827మంది సచివాలయ సిబ్బంది వీరికి పింఛన్లు అందజేయనున్నారు. ఇందుకోసం బుధవారం రాష్ట్ర ప్రభుత్వం రూ.113.17కోట్లు విడుదల చేసింది.

నేటినుంచి హెల్మెట్ ధరించాల్సిందే

డిమాండ్‌కు దీటుగా దొరకని బ్రాండెడ్ హెల్మెట్లు



తిరుపతి(నేరవిభాగం), జూలై 31: ద్విచక్ర వాహన చోదకులు గురువారం నుంచి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల్సిందే. జిల్లా వ్యాప్తంగా ఈ నిర్ణయం అమలుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇప్పటికే విస్తృత అవగాహన కల్పించింది. మరోపక్క ఆటోమొబైల్ షాపులు, వాహన మెకానిక్‌లు హెల్మెట్లు విక్రయాలు చేపట్టారు. అయితే తిరుపతిలో డిమాండ్‌కు తగ్గట్టు కంపెనీ బ్రాండెడ్ హెల్మెట్లు లేకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు వాహనాలు నడుపుతూ ఫోన్‌లో మాట్లాడే వారి సంఖ్య పెరిగింది. దీంతో ఆధునిక హెల్మెట్లపై జనం ఆసక్తి చూపుతున్నారు హెల్మెట్‌లోనే బ్లూటూత్, లైటింగ్ సిస్టమ్ ఉన్న హెల్మెట్లు వచ్చాయి. వీటి ధర కనీసం రూ.2500 వరకు ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఎక్కువ బరువు ఉన్నవి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. బ్రాండెడ్ కంపెనీల హెల్మెట్‌లకు ఎక్కువగా డిమాండ్ ఉంది. పాత తిరుచానూరు రోడ్డులోని కొన్ని షోరూముల్లో సాధారణ హెల్మెట్ రూ.1000 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. తిరుపతిలో దాదాపు 1.80 లక్షల హెల్మెట్లు అవసరముందని అంచనా. వారం పది రోజుల్లో కంపెనీ హెల్మెట్లు తెప్పిస్తామని షోరూం యజమానులు చెబుతున్నారు.

తిరుచానూరు పెద్దచెరువుకు గండి

- వీవీ నగర్ అపార్టుమెంట్లలోకి నీళ్లు
- కన్నెత్తి చూడని ఇరిగేషన్, తుడా
- గండి ఆక్రమణదారుల పనే అని స్థానికుల్లో అనుమానాలు



పెద్ద చెరువుకు పడిన గండి



వీవీ నగర్ అపార్టుమెంట్లలోకి నీళ్లు

తిరుచానూరు, జూలై 31 : తిరుచానూరు పెద్ద చెరువుకు గండిపడింది. దీంతో చెరువులో నీళ్లు తిరుచానూరులోని వీవీనగర్ ఇళ్లలోకి, అపార్ట్‌మెంటుల్లోకి చేరడంతో కాలనీవాసులు ఆందోళనపడ్డారు. అటు పద్మావతిపురం నుంచి ఇటు తిరుచానూరులోని వీవీ నగర్ వరకు విస్తరించి వున్న ఈ చెరువులో కొంతభాగాన్ని శిల్పారామానికి, గ్రాండ్ రిడ్జ్ హోటల్‌కు, మరి కొంత భాగాన్ని మహిళా ప్రాంగణానికి, ఐటీఐకి గతంలో కేటాయించారు. సుమారు 17 ఎకరాల వరకూ పర్యాటక అభివృద్ధి పేరుతో వైసీపీ ప్రభుత్వం తుడాకు అప్పగించింది. అమ్యూజ్‌మెంట్ పార్కు పేరుతో ఓ ప్రైవేటు సంస్థకు తుడా లీజుకు ఇచ్చింది. అయితే ఆ సంస్థ చెరువులో నీరున్న ప్రాంతాన్ని చదును చేసి వదిలేసింది. అటు పద్మావతిపురం, శ్రీనివాసపురం, నగరంలో కొన్ని ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు, వర్షపు నీరు చెరువులోకి చేరుతుంది. ఈ క్రమంలో పద్మావతిపురం శివారులో గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు చెరువును కబ్జా చేశారు. మిగిలిన భాగాన్ని కూడా కబ్జా చేయాలనే మంగళవారం రాత్రి చెరువుకు గండి కొట్టినట్లు ప్రచారం జరుగుతోంది.దీంతో చెరువులోని నీరు తిరుచానూరులోని వీవీనగర్‌ను ముంచెత్తింది. ఇళ్లలోకి, అపార్ట్‌మెంటుల్లోకి నీళ్లు చేరడంతో కాలనీవాసులు ఉలిక్కిపడ్డారు.తాగునీటి సంపుల్లోకి ఈ బురద నీరు చొచ్చుకెళ్లింది.స్థానికులు బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. ఇరిగేషన్, తుడా అధికారులకు సమాచారం అందించినా వారు స్పందించలేదని స్థానికులు మండిపడుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌రాజు తన బృందంతో బుధవారం ఉదయం ఎక్సకవేటర్ సాయంతో గండిని పూడ్చివేశారు.అయితే నడవడానికి రోడ్లన్నీ బురదగా మారడంతో జనం ఇబ్బంది పడ్డారు.తాగునీటి కోసం అల్లాడిపోయారు. గతంలో కూడా కల్వర్టు తొలగించి నీటిని కాలనీ వైపు మళ్లించినట్లు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఇరిగేషన్, తుడా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈ చెరువు కట్టమీదనే రేణిగుంట రోడ్డు నుంచి పద్మావతి పురం శ్మశానం మీదుగా తిరుచానూరు ఫ్లైఓవర్ వరకు మాస్టర్‌ప్లాన్ రోడ్డు వస్తోంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టు ఏర్పాటు చేశారు. అయితే కల్వర్టుకు ఎలాంటి గేటు ఏర్పాట్లు చేయకపోవడంతో చెరువులోని నీటిని కొంతమంది గండికొట్టి కాలనీ వైపు మళ్లిస్తున్నారు.అసలు ఎవరు గండికొడుతున్నారో అనే విషయంపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. చెరువులో నీరుంటే తాము కబ్జా చేసిన స్థలాల్లోకి నీళ్లొస్తాయని గండి కొడుతున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ చెరువు నుంచి దిగువ ఉన్న నందిగుంట, దామినేడు చెరువుకు నీరు వెళ్లే కాలువలను కబ్జా చేయడంతో ఆ నీటి ప్రవాహం కూడా వీవీనగర్, కొత్తకాలనీ లేఅవుట్లకు వెళతోంది. ఒకవేళ భారీ వర్షాలు వచ్చి చెరువు నిండితే అపుడు కూడా ఇలాగే కల్వర్టుకు ఉన్న మట్టిని తొలగిస్తే తమ పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



గండిని పూడుస్తున్న పంచాయతీ సిబ్బంది

సీఎం సమీక్షకు నివేదికలు సిద్ధం చేయండి

- కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31: జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో ఆయన సమీక్షిస్తూ... ఆగస్టు మొదటి వారంలో ముఖ్యమంత్రి కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్, పర్యాటక శాఖ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ తదితర శాఖలపై సమీక్షించారు. పవర్ ప్రెజంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పలువురు డీఎస్పీల బదిలీ



జి.శ్రీనివాస రావు



శ్రీనివాసాచారి

తిరుపతి(నేరవిభాగం), జూలై 31 : పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. చంద్రగిరి సమీపంలోని కల్యాణి డ్యాం వద్ద వున్న పోలీసు ట్రైనింగ్ కళాశాల డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును నెల్లూరు రూరల్ డీఎస్పీగా బదిలీ చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ బి. ఉమామహేశ్వరరావును,గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు.తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారిని సీఐడీ విభాగానికి బదిలీ చేశారు.తిరుపతి రైల్వే విభాగ డీఎస్పీగా పనిచేసిన షాను షేక్‌ను పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు.తిరుమల డీఎస్పీ శ్రీనివాసాచారిని కర్నూలు దిశ డీఎస్పీగా బదిలీ చేశారు. గతంలో తిరుచానూరు, గంగవరం, తిరుపతి స్పెషల్ బ్రాంచిలో పనిచేసి ప్రస్తుతం నెల్లూరు క్రైం విభాగంలో వున్న రామకృష్ణమాచారిని తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీగా నియమించారు.రెండు రోజుల్లో మరోసారి భారీఎత్తున జరగనున్న డీఎస్పీల బదిలీల్లో జిల్లానుంచి మరో ఐదుగురు బదిలీ కానున్నారు. తిరుపతి డీఎస్పీగా కాకినాడ సెబ్‌లో పనిచేస్తున్న వెంకట నారాయణను నియమించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.





శ్రీకాళహస్తిలో బుధవారం సత్య ఏజన్సీస్ 26వ బ్రాంచిని అధినేత స్వరూప్ మురారి ప్రారంభించారు.ఏపీ హెడ్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగించండి

- నాడు ఈవో ధర్మారెడ్డి ఏకపక్షంగా తొలగించారు
- హైకోర్టులో ఏవీ రమణ దీక్షితులు పిటిషన్
- కౌంటర్ దాఖలుకు దేవదాయ ముఖ్యకార్యదర్శి, టీటీడీ ఈవోకు హైకోర్టు ఆదేశాలు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఏవీ రమణదీక్షితులు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శికి, టీటీడీ ఈవోకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ ఈ ఏడాది మార్చి 2న అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను ఏవీ రమణదీక్షితులు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్ వాదనలు వినిపించారు. "పిటిషనర్‌కు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా టీటీడీ ఈవో అప్పట్లో వ్యవహరించారు. ఈవో ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి రమణదీక్షితులు ప్రధాన అర్చకుడిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలి" అని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

తిరుమలలో సచివాలయానికి భూమిపూజ


భూమిపూజలో కూటమి నాయకులు

తిరుమల, జూలై 31 (ఆంధ్ర జ్యోతి): తిరుమల స్థానికులు నివాసముండే బాలాజీనగర్‌లో సచివాలయ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం భూమిపూజ చేశారు. ప్రస్తుతం తిరుమలలోని డీటైప్ క్వార్టర్స్‌లో తాత్కాలికంగా సచివాలయం ఉన్న విషయం తెలిసిందే. బుధవారం కూటమి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్‌తో కలిసి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమల, తిరుపతి స్థానికులకు సంబంధించిన 19 సమస్యలపై టీటీడీ ఈవోతో చర్చించామన్నారు.

అదనపు ఈవోతో భేటీ : టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన నేతలు రాజారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ కూడా అదనపు ఈవోను కలిసి స్థానికుల సమస్యలపై చర్చించారు. టీడీపీ నేతలు శ్రీధర్‌వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, రాజు యాదవ్, శివ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

భాకరాపేట, జూలై 31: ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్యపుస్తకాలను బుధవారం పంపిణీ చేసినట్లు చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు నోటుబుక్కులు, బ్యాగులు పంపిణీ చేయడం ఇదే ప్రథమం అన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలన్నారు. సీనియర్ అధ్యాపకులు నాగరాణి, సునంద, తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలున్న భోజనం అందించడం హర్షణీయం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న గ్రామస్తులు

చంద్రగిరి, జూలై 31: విద్యార్థులకు పోషక విలువలు ఉన్న భోజనాన్ని అందించడం హర్షణీయమని టీడీపీ నాయకుడు కొమ్మినేని అజయ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనలతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏడు రోజుల శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా బుధవారం చంద్రగిరి మండలం పుల్లయ్యగారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుభ దిన్ భోజన కార్యక్రమాన్ని అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామస్తుల సహకారంతో విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనాన్ని పెట్టారు. ఈసందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారంతో ఉత్తమ విద్యావంతులు కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్‌ఎం చంద్రకళ, గ్రామస్తులు కొమ్మినేని ఆనంద నాయుడు, సద్దా రాజేంద్ర నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి అభయం

తిరుచానూరు, జూలై 31: రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామికి తిరుచానూరులో బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం రోహిణిని పురస్కరించుకుని ఉత్సవర్లకు నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితులైన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్లు మధు, చంద్రశేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాస్కర్ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ధ్వజావరోహణంతో ముగిసిన
ఆనందగిరి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

- పాన్పు సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని


స్వామివారిని దర్శించుకొంటున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 31: పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై జూలై 27వ తేదీ శనివారం అక్కగార్ల పూజతో ప్రారంభమైన వల్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. ఐదు రోజులపాటు వైభవంగా జరిగిన ఉత్సవాలలో భాగంగా ఉదయం యాగశాల పూజ, పూర్ణాహుతి, సాయంత్రం కలశాభిషేకం, తోట ఉత్సవాన్ని ఊట్లవారిపల్లికి చెందిన ఉభయదారులు వి.రామచంద్ర నాయుడు, యశోదమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాత్రి ఊట్లవారిపల్లెకు చెందిన శ్రీరామనేని మునెమ్మ, మదన్ మోహన్ చౌదరి, ప్రసాదరావుల ఆధ్వర్యంలో కంకణ విసర్జన, ధ్వజావరోహణం, పాన్పు సేవలను వైభవంగా నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రాత్రి జరిగిన స్వామి వారి పాన్పుసేవలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నానీకి శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మోత్సవాలు గతంలో కన్నా ఈ సంవత్సరం ఘనంగా జరిగాయని తెలిపారు. ఇందుకు సహకరించిన స్థానికులు, భక్తులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, కమిటీ సభ్యులు చెంగల్రాయులు, హరి, రఘునాథయ్య, చెంగల్‌రాయలు, లలిత, బాలశేఖర్ రెడ్డి, నరేంద్రబాబు, రంగప్రసాద్, శివకుమార్, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20,67,650 ఆదాయం

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో ఆలయానికి రూ.20,67,650 ఆదాయం వచ్చింది. తలనీలాల ద్వారా రూ.2,90,000, పాదరక్షల ద్వారా రూ.10వేలు, కొబ్బరి చిప్పల ద్వారా రూ.4,100 ఆదాయం వచ్చింది. సేవా టికెట్ల ద్వారా రూ.3,20,960, హుండీ ద్వారా రూ.14,33,392, కళ్యాణోత్సవం చదివింపులకు రూ.9,198 వచ్చాయి. మొత్తం రూ.20,67,650 ఆదాయం వచ్చింది.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి అనర్హత పిటిషన్‌పై విచారణ వాయిదా

పుంగనూరు జూలై 31: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనర్హత కేసు ఆగస్టు 5వ తేదికి వాయిదా పడింది. ఎన్నికల అఫిడవిట్‌లో 142 ఆస్తులు పేర్కొనలేదని, ఆయన్ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని హైకోర్టులో బీసీవైపార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ పిటిషన్ వేశారు. దీనిపై ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఈ కేసును హైకోర్టులో రాష్ట్ర బార్‌కౌన్సిల్ అధ్యక్షుడు వైవీ రవిప్రసాద్ వాదనలు విన్న న్యాయమూర్తి ఎన్నికల్లో రెండవ స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డికి కూడా ఇంప్లీడ్ పిటిషన్ వేయాలని ఆదేశించారన్నారు. రెండో స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి ఇంప్లీడ్ అవ్వకపోయినా సెక్షన్ 82(2) ప్రకారం పిటిషనర్ కూడా అభ్యర్థిగా ఉన్నందున విచారణ కొనసాగించవచ్చునని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతో జడ్జి కేసు విచారణను ఆగస్టు 5వతేదీకి వాయిదా వేసినట్లు వివరించారు. ఎన్నికల కేసు విచారణ వేగం పెరిగిందని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనర్హత వేటు పడేలా హైకోర్టుకు అన్ని రికార్డులు అందజేశామని చెప్పారు.

కాల్వ పోరంబోకు ఆక్రమణకు యత్నం

స్థానికులు అడ్డుకోవడంతో వెనుతిరిగిన ఆక్రమణదారులు


జేసీబీతో చదును చేస్తుండగా అడ్డుకుంటున్న స్థానికులు

తిరుపతి రూరల్, జూలై 31: తిరుపతి రూరల్ మండలం పేరూరులో సర్వేనెంబరు 460లో కాలువ పోరంబోకు భూమి ఆక్రమణకు బుధవారం కొందరు ఆక్రమణదారులు ప్రయత్నించారు. ఆక్రమణదారులు ఈ భూమిని జేసీబీతో చదును చేస్తున్నారన్న సమాచారంతో గ్రామస్తులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. స్థానిక మహిళలు, ఆక్రమణదారుల మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ, వీఆర్వోలు చేరుకున్నారు. రెవెన్యూ రికార్డులలో ఈ భూమి కాలువ పోరంబోకుగా నమోదై ఉందని, ఈ భూమిని ఆక్రమించినా, ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని హెచ్చరిక బోర్డుని ఏర్పాటు చేసిన విషయాన్ని రెవెన్యూ అధికారులు గుర్తు చేశారు. అయితే ఈస్థలంలో ఉన్న హెచ్చరిక బోర్డుని తొలగించడంతో ఆక్రమణదారులపై ఆగ్రహించారు. స్థానికులు మాట్లాడుతూ.. సుమారు 200 అంకణాల భూమిని ఆక్రమించేందుకు యత్నించారని, దీని విలువ సుమరు రూ.2 కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ భూమిలో గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాటిని కూడా పూర్తిస్థాయిలో తొలగించి యథాస్థితిలో ఉంచాలని కోరారు. ఎస్సీకాలనీలోని పేదలకు ఈ భూమిని ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రస్తుత అధికార, ప్రతిపక్షపార్టీలకు చెందిన ఇరువురు నేతలు ప్రయత్నిస్తున్నారని స్థానికులు అంటున్నారు. మరోపక్క స్థానిక వైసీపీ నేతలే ఆక్రమణకు ప్రయత్నించారని టీడీపీ నేతలు ఆరోపిస్తుండగా.. కాదు టీడీపీ నేతలే ఆక్రమణకు ప్రయత్నించారని వైసీపీ నేతలు ఆరోపించడం గమనార్హం. రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి ఈ కాలువ భూమి ఆక్రమణలకు గురి కాకుండా తగు చర్యలు చేపట్టాల్సి ఉంది.

గత ఐదేళ్ల అరాచక పరిపాలనతో
ఏపీ దెబ్బతింది
- ఎమ్మెల్యే సుజనా చౌదరి -

తిరుమల, జూలై31(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అరాచక, చేతగాని పరిపాలనతో ఏపీ చాలా దెబ్బతిందని విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. స్వామి ఆశీస్సులతో కూటమిని ప్రజలే భారీ మెజార్టీతో గెలిపించుకున్నారన్నారు.స్వామిని దర్శించుకుని ఏపీకి మంచి జరగాలని కోరుకున్నట్టు తెలిపారు. అలాగే తన మనవడి పుట్టువెంట్రుకలు కూడా సమర్పించామన్నారు.

సూళ్లూరుపేటలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ సీజ్



సూళ్లూరుపేట, జూలై 31: పట్టణంలో అల్ షీరిస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను బుధవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ సీజ్ చేశారు. 10 రోజుల క్రితం ఆర్డీవో చంద్రముని అధికారులతో కలిసి పట్టణంలో హోటళ్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేపట్టి నిల్వ పదార్థాలు, అపరిశుభ్రంగా వాతావరణం ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. జీఎన్‌టీ రోడ్డులో ఆర్‌ఆర్ సూపర్ మార్కెట్ పక్కనే అల్ షీరిస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో నిల్వ మాంసం వినియోగిస్తున్నారని పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ మున్సిపాలిటీ సిబ్బందితో అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. నిబంధనల మేరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ లేకపోవడంతో సీజ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.



అక్షరాలా
రూ.1537 కోట్లు
ఉమ్మడి జిల్లాలో కరెంటు బకాయిలు

- పంచాయతీరాజ్‌దే రూ.1427 కోట్లు
- అన్ని ప్రభుత్వ శాఖల బకాయిలు రూ.43 కోట్లు
- ప్రైవేటు బకాయిలు రూ.67 కోట్లు

ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఎస్పీడీసీఎల్‌కు గుదిబండగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు బకాయిలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలవీ రూ.1537 కోట్లకుపైగా రావాల్సి ఉంది. ఏదో రెండో, మూడో శాఖలు తప్పిస్తే బిల్లుల చెల్లింపుల్లో ప్రధాన శాఖలన్నీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం.

మరోవైపు, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలో నష్టాలు వస్తున్నాయంటూ గత వైసీపీ ప్రభుత్వం కరెంటు ఛార్జీలను ఏడు సార్లు పెంచి సామాన్యులపై భారం మోపింది. జనంపై భారం మోపేందుకు ఏ మాత్రం ఆలోచించని ప్రభుత్వం ఎస్పీడీసీఎల్‌కు విద్యుత్ బిల్లులు చెల్లించడంలో మాత్రం అంతులేని నిర్లక్ష్యాన్ని చూపింది.

కరెంటు బిల్లుల చెల్లింపులో కాస్త ఆలస్యమైతే చాలు.. వినియోగదారులపై అపరాధ రుసుం విధిస్తారు. గడువులోపు చెల్లించకుంటే కనెక్షన్ తొలగించేస్తారు. మరి ప్రభుత్వ కార్యాలయాలు బిల్లులు చెల్లించకుంటే మాత్రం ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉంది ఎస్పీడీసీఎల్. ఒక రూపాయి, రెండు రూపాయలు కాదు.. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.1537 కోట్లు పైగా విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆయా శాఖలకు ప్రభుత్వం సక్రమంగా నిధులు కేటాయించి ఉంటే బిల్లులు చెల్లింపులో ఇంత జాప్యం ఉండేది కాదని అధికారులు అంటున్నారు. అధిక మొత్తంలో బకాయిలు ఉన్న కొన్ని శాఖల వివరాలు పరిశీలిస్తే.. పంచాయతీరాజ్‌లో అత్యధికంగా రూ.1407 కోట్లు కాగా మున్సిపాలిటీల పరిధిలోని స్ట్రీట్‌లైట్లు, వాటర్‌వర్క్‌లు రూ.18 కోట్లు, కార్పొరేషన్ పరిధిల్లో పరిధిలోని స్ట్రీట్ లైట్లు, వాటర్‌వర్క్‌లు రూ.9 కోట్లు, పంచాయతీ రాజ్ రూ.9 కోట్లు, విద్యాశాఖ రూ.8.5 కోట్లు, రెవెన్యూ రూ.6 కోట్లు, మెడికల్ అండ్ హెల్త్ రూ.4 కోట్లు బకాయిలు ఉన్నాయి.

పంచాయతీ నిధులను మళ్లించినా..

జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరెంటు బిల్లుల కోసమని పంచాయతీల నిధులు మళ్లించేశారు. తద్వారా పది శాతం బిల్లులు మాత్రమే చెల్లించినట్లు సమాచారం. ఇంకా రూ.1407 కోట్ల బకాయిలున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. దీంతో పంచాయతీ భవనాలకు, మేజర్, మైనర్ పంచాయతీల్లో స్ట్రీట్ లైట్లు, వాటర్‌వర్క్‌లకు ఒక రూపాయి కూడా పంచాయతీలు చెల్లించలేక పోయాయి.

తలపట్టుకుంటున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి 48645 సర్వీసులు ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.1470 కోట్లు, ప్రైవేటు(గృహ) సర్వీసులు 1337746 కాగా, ఇందులో ఎస్సీ, ఎస్టీ 117713 సర్వీసులకు సంబంధించి రూ.37 కోట్లు మొత్తం రెండు కలిసి మొత్తం రూ.1537 కోట్లు బకాయిలు మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయి. వీటిని వసూలు చేయలేక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కదా తాము కట్టేందుకు అని అధికారులు వాపోతున్నారు. చేసేది లేక విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వ శాఖలకు నోటీసులు ఇచ్చి తలలు పట్టుకొని కూర్చుంటున్నారు.

- చిత్తూరు రూరల్

బంగారు తిరుచ్చిపై దేవేరులతో కృష్ణస్వామి



చంద్రగిరి, జూలై 31: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్ల కల్యాణోత్సవం నిర్వహించారు. రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం స్వామి అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై ఊరేగించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, ముని చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు

రామచంద్రాపురం, జూలై 31: మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లకుండా పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రకృతి వనం వ్యవస్థాపకులు ఎంసీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. వెంకట్రామపురం సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం పర్యావరణంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి ఎన్నో ఔషధాలను ఇచ్చిందని, వాటి ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవులను కాపాడుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన జేడీ



రామచంద్రాపురం, జూలై 31: రామచంద్రాపురం మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బుధవారం జిల్లా ప్రాజెక్టు మేనేజరు షణ్ముగం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు సందర్శించారు. మండలంలోని నెత్తకుప్పం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న ఏటీఎం మోడల్, ఏగ్రేడ్ మోడల్, పీఎండీఎస్ పద్ధతులను పరిశీలించారు. వ్యవసాయ కార్యకర్తలు, రైతులు పాటించే పద్ధతులు, ఖర్చు, రాబడి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఎంటీలు స్వామి, కొండయ్య, రంగయ్య, వీఏలు భరత్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు మోగిన నగారా

తిరుపతి (విద్య), జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు రాష్ట్ర విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా జారీ చేయనుంది. రెండేళ్ల కాలపరిమితితో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు అభ్యర్థుల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారు. 5న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలియజేయడం, ఫిర్యాదులుంటే పరిష్కరించడం చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటలకు తుది ఓటరు జాబితా ఖరారు, నోటీసు బోర్డులో ప్రదర్శన ఉంటుంది. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు మొత్తం 15 మంది సభ్యులను ఎన్నుకోవాలి. కమిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు ఒకరికి తక్కువ కాకుండా కమిటీ కూర్పు ఉండాలి. కమిటీలో 10 మంది మహిళలు, ఐదుగురు పురుషులు ఉండేవిధంగా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్త వహించాలి.

రైలు దిగబోయి కిందపడి మృత్యువాత



పాకాల, జూలై 31: ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం పాకాల రైల్వే స్టేషన్‌లో జరిగింది. చిత్తూరు రైల్వే ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు వివరాలు... పాకాల మండలం రవణయ్యగారిపల్లెకు చెందిన గవర్నర్ బాషా (45) బుధవారం ఉదయం చిత్తూరు వెళ్లడానికి పాకాల రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ కొని పొరపాటున కాట్పాడి నుంచి తిరుపతి వెళుతున్న మూడో నెంబర్ ప్లాట్‌ఫారంలో ఉన్న ప్యాసింజర్ రైలు ఎక్కాడు. రైలు కదులుతున్న సమయంలో పక్క ప్రయాణికుడిని అడిగి రైలు తిరుపతి వైపు వెళుతుందని తెలుసుకొని కదులుతున్న రైలులో నుంచి దిగడానికి ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు రైలు బోగి , ప్లాట్‌ఫారం మధ్యలో పడి ఇరుక్కుపోయాడు. తీవ్రంగా గాయపడిన ఇతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మపాలే శిశువుకు శ్రీరామ రక్ష

● నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



తిరుపతి(వైద్యం), జూలై 31 : ఔషధ గుణాలుండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే తల్లిపాల విషయంలో చాలామందికి అవగాహన కొరవడుతోంది. కొందరు మూఢనమ్మకాలతో బిడ్డలకు ముర్రుపాలు పట్టించరు. ఇలాంటి చిన్నారులు నిత్యం వ్యాధుల బారిన పడుతుంటారు. ఈనేపథ్యంలోనే ఐసీడీఎస్, వైద్యఆరోగ్యశాఖలు సంయుక్తంగా గురువారం నుంచి తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాయి. జిల్లాలో 2492 అంగన్‌వాడీ కేంద్రాలు, 58 ప్రాథమిక వైద్యశాలలతోపాటు తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఈ వారోత్సవాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు.

బిడ్డకు ప్రయోజనాలివి

తల్లిపాలలో ప్రొటీన్లు,లాక్టోజ్, కాల్షియం అధికంగా ఉంటాయి. దీనివల్ల బిడ్డ మెదడు చురుగ్గా పనిచేస్తుంది. వ్యాధి నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. రక్త హీనత బారిన పడకుండా శిశువును రక్షిస్తాయి. న్యుమోనియా, డయేరియా వంటి వ్యాధుల నుంచి కాపాడతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముర్రుపాలిచ్చే బాలింతకు కూడా వ్యాధులు దరిచేరవు. భవిష్యత్తులో రొమ్ము, అండాశయ క్యాన్సర్లు, మధుమేహం వంటి వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ పాల ప్రాముఖ్యతను గుర్తించి తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో తల్లిపాల నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

తల్లిపాలు శ్రేయస్కరం



శిశువు ఆరోగ్యంగా ఎదగాలన్నా, భవిష్యత్తులో వ్యాధులను తట్టుకోవాలన్నా తల్లిపాలకు మించిన దివ్య ఔషధం మరొకటి లేదు. ముర్రుపాలలో రెట్టింపు స్థాయి వ్యాధి నిరోధక శక్తి ఉంటుంది. వీటిని తప్పక పట్టించాలి. కనీసం ఆరు నెలలైనా తల్లిపాలను అందించాలి.

- డాక్టర్ పార్థసారథిరెడ్డి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్

విస్తృత అవగాహన కల్పిస్తున్నాం



తల్లిపాల విశిష్టత గురించి అవగాహన పెంచేలా వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తాం. పీహెచ్‌సీలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలను భాగస్వాములను చేసి ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో రోజూ తల్లిపాల ప్రాముఖ్యత వివరిస్తాం. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లను కూడా తెలియజేస్తాం.

- డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి

కోదండ రామస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం



తిరుపతి (కల్చరల్) జూలై 31: తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సీతా లక్ష్మణ సమేత రాముల వారి ఉత్సవమూర్తులను యాగశాలలో వేంచేపు చేశారు. అక్కడే స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం శాత్తుమొర, ఆస్థానం జరిగింది. సాయంత్రం సీతారామ లక్ష్మణులు తిరుచ్చిపై ఆలయ మాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం జరిపారు. టీటీడీకి చెందిన అన్నమయ్య ప్రాజెక్టు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు భక్తి సంగీత కార్యక్రమాలను నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటి ఈవో నాగరత్న, కంకణభట్టార్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వినాయకసాగర్ పరిశీలన



వినాయకసాగర్‌ను పరిశీలిస్తున్న మౌర్య

తిరుపతి (జీవకోన), జూలై 31: వినాయకసాగర్‌ను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ మౌర్య అధికారులకు సూచించారు. బుధవారం ఆమె వినాయకసాగర్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వాకర్స్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. సాగర్ వద్ద 5ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. శుద్ధి ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైరైన అధికారులకు ఎస్పీ సత్కారం



తిరుపతి(నేరవిభాగం), జూలై 31: విధి నిర్వహణలో ఒత్తిళ్లు ఎదుర్కొన్నవారు ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితం నిశ్చింతగా గడపాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆకాంక్షించారు. జిల్లా పరిధిలో బుధవారం ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ సురేంద్ర రెడ్డి, విజయభాస్కర్, చెంచుకృష్ణమనాయుడులను పోలీసు అతిథిది గృహంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా సేవలందించి రిటైర్ కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఏఎస్పీ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ డెవలప్‌మెంట్ డీన్‌గా బాలాజి



ఉత్తర్వులు అందుకుంటున్న బాలాజి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31: ఎస్వీయూ డెవలప్‌మెంట్ డీన్‌గా బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ మేరిగ బాలాజీ నియమితులయ్యారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు బుధవారం నియామక ఉత్తర్వులను ఆయనకు అందజేశారు. గూడూరుకు చెందిన బాలాజీ 2007లో అధ్యాపకులుగా చేరారు. ఈయన పర్యవేక్షణలో 13 పీహెచ్‌డీలు పూర్తయ్యాయి. 3 పుస్తకాలు, 116 పరిశోధనా వ్యాసాలు రాశారు. 11 రీసెర్చ్ ప్రాజెక్టులు చేశారు. అమెరికాలో పీడీఎఫ్ చేశారు. ఐసీఎంఆర్ అవార్డు ద్వారా రూ. 50 వేల నగదు బహుమతి పొందారు. ప్రొఫెసర్ బాలాజీని పలువురు అభినందించారు.

టీటీడీ ఈవోతో వీసీ, రిజిస్ట్రార్ భేటీ

ఎస్వీయూ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావును వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కోరారు. బుధవారం ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టీటీడీ నుంచీ యూనివర్సిటీకి అందిస్తున్న వార్షిక నిధులను విడుదల చేయాలన్నారు. తప్పకుండా సహకారం అందిస్తామని ఈవో హామీ ఇచ్చారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి: జనసేన

తిరుపతి అర్బన్, జూలై 31: నగరంలో డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జనసేన తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ కోరారు. నగర కమిషనర్ మౌర్యను ఆయన బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికి మురికినీరు రోడ్లపై చెరువులను తలపిస్తోందన్నారు. రేణిగుంట రోడ్డులో అండర్ డ్రైనేజీ బయటకు పారుతోందన్నారు. పెద్ద కాలువలు తరచూ శుభ్రం చేయకపోవడం, తూముల్లో పేరుకుపోయిన చెత్త తొలగించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. దశాబ్దాలనాటి వృక్షాలు ప్రమాదకరంగా ఉన్నాయని, పారిశుధ్యం మెరుగుపర్చాలని, పలు కాలనీలకు తాగునీరు సరఫరా కావడంలేదని వివరించారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.కిరణ్‌తోపాటు పార్టీ నాయకులు ఉన్నారు.

ఉత్తమ కవితా పురస్కార ప్రదానం



తులసిని సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31: పద్మావతి వర్సిటీ సోషల్ వర్క్ ప్రొఫెసర్ తమితాతులసి పిఠాపురంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో సాహస జీవితం పేరుతో వినిపించిన కవిత ప్రశంసలందుకుంది. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక ఎమ్మెల్యే చినరాజప్ప, నిర్వాహకులు ఉత్తమ కవితా పురస్కారం అందజేసి సత్కరించారు. కవిత్వం ద్వారా సామాజిక చైతన్యం తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నట్టు తులసి పేర్కొన్నారు.

కాలుష్య రహితంగా చవితి వేడుకలు



మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి (జీవకోన), జూలై 31: వినాయక చవితి పండుగను వైభవంగా నిర్వహించుకుందామని ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక బాలాజీ కాలనీలోని సొసైటీ భవనంలో తిరుపతి వినాయక మహోత్సవ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితమైన, ప్లాస్టిక్ రహిత వినాయక విగ్రహాలతో పండుగ నిర్వహించుకుందామన్నారు. నిమజ్జనానికి వినాయకసాగర్‌లో చేపట్టాల్సిన మార్పులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంగాటి గోపాల్‌రెడ్డి, కరాటే శ్రీనివాస్, ఎస్వీఎం వెంకటేష్, చెన్నం నవీన్, మధు, వేణుగోపాల్‌నాయుడు, హేమకిరణ్, చందురాయల్, పార్థు, శేఖర్‌రెడ్డివ్వ, బాబు, గోపి, ప్రసాద్, మణికంఠ, వాసు, సదాశివం, కృష్ణయ్య, శరత్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలకు అంతరాయం

తిరుపతి(ఆటోనగర్), జూలై31: నగరంలో బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ విఫలం కావడంతో టీపీ ఏరియాలో యూకోబ్యాంక్‌లో బుధవారం సుమారు మూడు గంటల పాటు సేవలకు అంతరాయం కలిగింది. దీంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు.

రిటైరైన ఉద్యోగికి సన్మానం



వెంకట రమణను సన్మానిస్తున్న సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), జూలై 31: విద్యుత్ సంస్థలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఎదిగి వినియోగదారులకు వెంకటరమణ చేసిన సేవలు అభినందనీయమని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వెంకటరమణను బుధవారం తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయ ప్రాంగణంలోని అనెక్స్ భవనంలో ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, సి.అయూబ్‌ఖాన్,సీజీఎంలు జె.రమణాదేవి,కెఆర్ఎస్ ధర్మజ్ఞాని,కె.ఆదిశేషయ్య,ఆర్.పద్మ,ఎన్.శోభావాలంటీన,జీఎంలు మురళి,ఎం.క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ల ప్రదానం



లోకనాథ్ శతపథి



మహబూబ్ బాషా

తిరుపతిరూరల్/తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై31: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో వేదభాష్యం విభాగంలో పరిశోధన చేసిన కె.లోకనాథ్ శతపథికి పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు సీవోఈ పేర్కొన్నారు. ఆగమ విభాగ ప్రొఫెసర్, దర్శన డీన్ ప్రొఫెసర్ వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యులు పర్యవేక్షణలో శుక్ల యజుర్వేద కాన్వసంహితలో ఉత్తర వింశతి అనంతాచార్యభాష్యంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. అలాగే ఎస్వీయూ మ్యాథ్స్ స్కాలర్ కె. మహబూబ్ బాషా డాక్టరేట్ పొందారు. సమ్ స్టడీస్ ఆన్ డామినేటింగ్ సెట్ ఫర్‌ఫెక్ట్ డామినేటింగ్ సెట్ అండ్ బాండేజ్ నెంబర్స్ విత్ అల్గోరిథమ్స్ యూజింగ్ ఇంటెర్వెల్ గ్రాఫిక్స్ అంశంపై ప్రొఫెసర్ అనుపల్లి సుధాకరయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు తొలిసారిగా డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై నేరుగా టీటీడీ ఈవోతో మాట్లాడవచ్చు. దీనికోసం భక్తులు 0877 2263261 నెంబరును సంప్రదించాల్సి ఉంటుంది.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయండి



రిజిస్ట్రార్ భూపతి నాయుడికి విన్నవిస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జూలై 31: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులను అకడమిక్ కన్సల్టెంట్లు కోరారు. యూనివర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ ఎంసీ ఓబులేసు నేతృత్వంలో బుధవారం పలువురు అధ్యాపకులు కలిసి తమ సమస్యలను వివరించారు. మే, జూన్, జూలై నెలలకు సంబంధించిన వేతనాలు విడుదల చేయాలని కోరారు. రెన్యువల్ ఆర్డర్ ఇవ్వాలన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించారు. పెండింగ్ వేతనాల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అకడమిక్ కన్సల్టెంట్లు తిరుపాలు, రమణ, తిమ్మప్ప, మల్లిఖార్జున, లాలునాయక్ పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



డిగ్రీ ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శనరావు, డాక్టర్ సుధాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై31: కరకంబాడీ రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జే ఎన్ టీ యూ ఏ వీసీ సుదర్శనరావు హాజరయ్యారు. ఏఐసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్, జేఎన్‌టీయూఏ (కలికిరి)ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్వీసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డిలు విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 850మంది బీటెక్ ఉత్తీర్ణులకు పట్టాలు, ఏడుగురికి గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ..విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు నిరంతర సాధన చేయాలన్నారు. నైపుణ్యత పెంచుకోవాలన్నారు. పారిశ్రామికరంగాల్లో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చైర్మన్ ఎ.గంగిరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రకాశ్‌అంబవరం, సెక్రటరీ ప్రదీప్ అంబవరం, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీపు డ్రైవర్ నిజాయితీ

● బంగారు వస్తువులు, నగదు బ్యాగు అప్పగింత



తిరుపతి (నేరవిభాగం), జూలై 31: తిరుమల ఘాట్ రోడ్డులో మరిచిపోయిన బంగారు వస్తువులు, నగదు బ్యాగును తిరిగి నిజాయితీగా అప్పగించిన వైనమిది. ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు...విశాఖ జిల్లాకు చెందిన గోపాలకృష్ణ తమ కుటుంబంతో బుధవారం కారులో తిరుమలకు వచ్చారు. తిరుమల ఘాట్ రోడ్డులో ఫొటోలు తీసుకుంటూ బంగారు నగలు, నగదు ఉన్న బ్యాగును అక్కడ మరచిపోయారు. తర్వాత గుర్తించి బాధితుడు తిరుమల క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ బ్యాగును జీపు డ్రైవర్ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈలోగా రూ.1.50 లక్షల నగదు, 140 గ్రాముల బంగారు నగలు, 201 యూఎస్ డాలర్లు ఉన్న బ్యాగును డ్రైవర్ నిజాయితీగా పోలీసులకు అప్పగించారు. డ్రైవర్ భూపతి నాయుడును ఎస్పీ అభినందించారు. బాధితులకు ఆ బ్యాగును అప్పగించారు.

మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31: మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో స్కూల్ న్యూట్రీ గార్డెన్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో న్యూట్రి గార్డెన్‌లను, కూరగాయలు, ఆకుకూరలను పెంచాలన్నారు. వాటిని సంరక్షించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. డీఈవో శేఖర్, అధికారులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఆర్సీ మునికృష్ణ



తిరుపతి, జూలై31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడును తిరుపతి టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ బుధవారం అమరావతి సచివాలయంలో కలిశారు. ఐదేళ్లపాటు గత వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ఎదుర్కొని అక్రమ కేసులు పెట్టుకున్న నాయకులు, కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. గత తిరుపతి పురపాలక ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలను ఎదుర్కొన్నామన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడిగా అవకాశం కల్పించాలని లేదా తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్‌గా మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. సీఎంను కలిసి శ్రీవారి ప్రసాదాలు అందజేసిన వారిలో 35వ డివిజన్ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే శ్రీధర్, జగన్నాథంలు ఉన్నారు.

సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయం



విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు

తిరుపతి(విద్య), జూలై 31: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ బుధవారం విడుదల చేసిన సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. రాధిక, ప్రణవ్, లిఖిత, సుశీలేంద్రరావు, సరిత అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను, బోధించిన అధ్యాపకులను ఈ సందర్భంగా వారు అభినందించారు.

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 31: అతిగా మద్యం తాగి ఆటో నడిపిన డ్రైవర్‌కు మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద 14 మందికి రూ 10,000 వంతున జరిమానా విధించారని పోలీసులు తెలిపారు.

టీసీఎల్ ఉద్యోగిని ఆత్మహత్య



గౌతమి (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, జూలై 31: ఏర్పేడు మండలం వికృతమాల రెవెన్యూ పరిధిలో ఉన్న టీసీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న ఓ మహిళ బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.... తిరుపతికి చెందిన గౌతమి(31) నాలుగేళ్లుగా టీసీఎల్ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తోంది. కంపెనీ సమీపంలో ఉన్న మునగలపాళెం గ్రామానికి చెందిన సురేంద్రబాబును రెండేళ్ల క్రితం వివాహం చేసుకుంది. వీరికి పిల్లలు లేరు. గౌతమి మునగలపాళెం నుంచి బుధవారం టీసీఎల్‌కు వెళ్లింది. పరిశ్రమ లోపల విషం తాగి కుప్పకూలిపోయింది. టీసీఎల్ అధికారులు ఆమెను అమర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. పోలీసుల విచారణలో మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

తల్లిపాలే శిశువుకు శ్రేష్ఠం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31: తల్లి పాల వల్ల శిశువుకు సరైన పోషకాహారం, రోగనిరోధక శక్తి లభిస్తుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగరపాలకసంస్థ కమిషనర్ మౌర్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, శ్రీనివాసరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంతకుమారి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎపిక్ కార్డుల కేసులో దోషులను శిక్షించాలి

● ఎస్పీకి బీజేపీ నాయకుల విజ్ఞప్తి

తిరుపతి (నేరవిభాగం), జూలై 31: తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డదారుల్లో గెలవడానికి దాదాపు 34 వేల దొంగ ఓటరు కార్డులు సృష్టించిన దోషులను చట్టం ముందు నిలబెట్టాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును బీజేపీ నాయకులు కోరారు. బుధవారం ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాసులు ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దొంగ ఓట్లు-కరెన్సీ నోట్లతో గెలవాలనే తప్పుడు ఆలోచనతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి ప్రయత్నించారన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారించకుండా కాలయాపన చేస్తున్నారని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల గుర్తింపు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించి అప్రమత్తం చేయాలన్నారు. ఇందుకోసం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదం జరిగిన గంటలోపు సమాచారం అందిస్తే ,ఆస్పత్రికి తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాణాలు కాపాడిన వ్యక్తికి ప్రశంసాపత్రంతో పాటు రూ.5వేలు బహుమతి లభిస్తుందని చెప్పారు. జిల్లా రవాణాశాఖ అధికారి ఆదినారాయణ, నేషనల్ హైవే పీడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హైవే పెండింగ్ పనులు పరిష్కరించండి

పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల పనుల్లో పురోగతి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారుల పెండింగ్ పనులపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, నేషనల్ హైవే అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

7న అమరరాజాలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31: అమరరాజా సంస్థలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇండస్ట్రీస్ కస్టమైజ్డు నైపుణ్య శిక్షణ ద్వారా టెన్త్, ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణులైన యువతీ యువకులకు ఈ నెల 7న తిరుపతిలోని అమర రాజా గ్రూప్ సంస్థల్లో మిషన్ ఆపరేటర్, అప్రెంటీస్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9000024919 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం సూచించారు.

వెంకటగిరిలో అక్రమ లేఅవుట్ల తొలగింపునకు చర్యలు

- రూ.11 కోట్లతో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి
- పైప్‌లైను ఆధునికీకరణకు రూ.93 కోట్ల మంజూరు
- త్వరలో రోడ్ల విస్తరణ
- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 31: పట్టణంలో అసంపూర్తిగా వున్న టిడ్కో ఇళ్లు పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాం లో అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయిస్తామన్నారు. ఇంకా పట్టణంలో అస్తవ్యస్తంగా వున్న తాగునీటి పైప్‌లైన్లను రూ.93 కోట్లతో మరమ్మతులు చేపడుతామన్నారు. సమావేశంలో వైసీపీ కౌన్సిలర్లు సమస్యలు ఏకరవు పెట్టడం చూస్తుంటే గత మూడేళ్లల్లో పాలకవర్గం ఏవిధంగా పని చేసిందో అర్థమవుతోందన్నారు. పైప్‌లైన్ల మరమ్మతులు ఒకే కాంట్రాక్టర్‌కు ఇవ్వడంపై కురుగొండ్ల మండి పడ్డారు. గత సీఎం జగన్ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి వెళ్లాడని నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనులను విడతల వారీగా పూర్తి చేస్తామన్నారు. పోలేరమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. సమావేశానికి వైసీపీ కౌన్సిలర్లు ముగ్గురు డుమ్మాకొట్టారు. అంతకు ముందు తొలిసారిగా మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భానుప్రియ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.


ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కురుగొండ్ల

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి అనర్హత పిటిషన్‌పై విచారణ 5కు వాయిదా

పుంగనూరు జూలై 31: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనర్హత కేసు ఆగస్టు 5వ తేదికి వాయిదా పడింది. ఎన్నికల అఫిడవిట్‌లో 142 ఆస్తులు పేర్కొన లేదని, ఆయన్ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని హైకోర్టులో బీసీవైపార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ పిటిషన్ వేశారు. దీనిపై ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఈ కేసును హైకోర్టులో రాష్ట్ర బార్‌కౌన్సిల్ అధ్యక్షుడు వైవీ రవిప్రసాద్ వాదనలు విన్న న్యాయమూర్తి ఎన్నికల్లో రెండవ స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డికి కూడా ఇంప్లీడ్ పిటీషన్ వేయాలని ఆదేశించారన్నారు. రెండో స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి ఇంప్లీడ్ అవ్వకపోయినా సెక్షన్ 82(2) ప్రకారం పిటిషనర్ కూడా అభ్యర్థిగా ఉన్నందున విచారణ కొనసాగించవచ్చునని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతో జడ్జి కేసు విచారణను ఆగస్టు 5వతేదీకి వాయిదా వేసినట్లు వివరించారు. ఎన్నికల కేసు విచారణ వేగం పెరిగిందని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనర్హత వేటు పడేలా హైకోర్టుకు అన్ని రికార్డులు అందజేశామని చెప్పారు.



అక్షరాలా రూ.1537 కోట్లు

ఉమ్మడి జిల్లాలో కరెంటు బకాయిలు

- పంచాయతీరాజ్‌దే రూ.1427 కోట్లు
- అన్ని ప్రభుత్వ శాఖల బకాయిలు రూ.43 కోట్లు
- ప్రైవేటు బకాయిలు రూ.67 కోట్లు

ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఎస్పీడీసీఎల్‌కు గుదిబండగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు బకాయిలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలవీ రూ.1537 కోట్లకుపైగా రావాల్సి ఉంది. ఏదో రెండో, మూడో శాఖలు తప్పిస్తే బిల్లుల చెల్లింపుల్లో ప్రధాన శాఖలన్నీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం.

మరోవైపు, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలో నష్టాలు వస్తున్నాయంటూ గత వైసీపీ ప్రభుత్వం కరెంటు ఛార్జీలను ఏడు సార్లు పెంచి సామాన్యులపై భారం మోపింది. జనంపై భారం మోపేందుకు ఏ మాత్రం ఆలోచించని ప్రభుత్వం ఎస్పీడీసీఎల్‌కు విద్యుత్ బిల్లులు చెల్లించడంలో మాత్రం అంతులేని నిర్లక్ష్యాన్ని చూపింది.

కరెంటు బిల్లుల చెల్లింపులో కాస్త ఆలస్యమైతే చాలు.. వినియోగదారులపై అపరాధ రుసుం విధిస్తారు. గడువులోపు చెల్లించకుంటే కనెక్షన్ తొలగించేస్తారు. మరి ప్రభుత్వ కార్యాలయాలు బిల్లులు చెల్లించకుంటే మాత్రం ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉంది ఎస్పీడీసీఎల్. ఒక రూపాయి, రెండు రూపాయలు కాదు.. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.1537 కోట్లు పైగా విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆయా శాఖలకు ప్రభుత్వం సక్రమంగా నిధులు కేటాయించి ఉంటే బిల్లులు చెల్లింపులో ఇంత జాప్యం ఉండేది కాదని అధికారులు అంటున్నారు. అధిక మొత్తంలో బకాయిలు ఉన్న కొన్ని శాఖల వివరాలు పరిశీలిస్తే.. పంచాయతీరాజ్‌లో అత్యధికంగా రూ.1407 కోట్లు కాగా మున్సిపాలిటీల పరిధిలోని స్ట్రీట్‌లైట్లు, వాటర్‌వర్క్‌లు రూ.18 కోట్లు, కార్పొరేషన్ పరిధిల్లో పరిధిలోని స్ట్రీట్ లైట్లు, వాటర్‌వర్క్‌లు రూ.9 కోట్లు, పంచాయతీ రాజ్ రూ.9 కోట్లు, విద్యాశాఖ రూ.8.5 కోట్లు, రెవెన్యూ రూ.6 కోట్లు, మెడికల్ అండ్ హెల్త్ రూ.4 కోట్లు బకాయిలు ఉన్నాయి.

పంచాయతీ నిధులను మళ్లించినా..

జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరెంటు బిల్లుల కోసమని పంచాయతీల నిధులు మళ్లించేశారు. తద్వారా పది శాతం బిల్లులు మాత్రమే చెల్లించినట్లు సమాచారం. ఇంకా రూ.1407 కోట్ల బకాయిలున్నాయి. గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. దీంతో పంచాయతీ భవనాలకు, మేజర్, మైనర్ పంచాయతీల్లో స్ట్రీట్ లైట్లు, వాటర్‌వర్క్‌లకు ఒక రూపాయి కూడా పంచాయతీలు చెల్లించలేక పోయాయి.

తలపట్టుకుంటున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి 48645 సర్వీసులు ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.1470 కోట్లు, ప్రైవేటు(గృహ) సర్వీసులు 1337746 కాగా, ఇందులో ఎస్సీ, ఎస్టీ 117713 సర్వీసులకు సంబంధించి రూ.37 కోట్లు మొత్తం రెండు కలిసి మొత్తం రూ.1537 కోట్లు బకాయిలు మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయి. వీటిని వసూలు చేయలేక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కదా తాము కట్టేందుకు అని అధికారులు వాపోతున్నారు. చేసేది లేక విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వ శాఖలకు నోటీసులు ఇచ్చి తలలు పట్టుకొని కూర్చుంటున్నారు.

\- చిత్తూరు రూరల్


తిరుమలలో రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు రేపు తొలిసారిగా డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై నేరుగా టీటీడీ ఈవోతో మాట్లాడవచ్చు. దీనికోసం భక్తులు 0877 2263261 నెంబరును సంప్రదించాల్సి ఉంటుంది.

వెంకటగిరి- బెంగళూరు బస్సు సర్వీసు ప్రారంభం

వెంకటగిరి, జూలై 31: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం వెంకటగిరి డిపోలో వెంకటగిరి - బెంగళూరు అద్దె బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. సర్వీసులను తగ్గించడమే కాకుండా బస్టాండ్లు, డిపోలను అమ్మకానికి పెట్టిందన్నారు. త్వరలో చెన్నైకు రెండు బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. వెంకటగిరి నుంచి నెల్లూరు, తిరుపతి, నాయుడుపేట మార్గాల్లో కూడా సర్వీసులు పెంచుతామన్నారు. ఆర్టీసీ డీఎం రామకృష్ణ, సిబ్బంది, ఆర్టీసీ యూనియన్ నాయకులు కె.వి.రత్నం, వై.వి. ప్రసాద్, ఆర్. కృష్ణయ్య, పూర్ణారావు, సుబ్బారావు తదితరులు ఎమ్మెల్యేని పూలమాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాందాస్ గంగాధర్, పునుగోటి విశ్వనాథనాయుడు, కే.వి.కే ప్రసాద్ నాయుడు, మల్లారం బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు, చంగారావు, జీకేపల్లి బాబు, తోటా రామచంద్రయ్య, జానపాటి బాలకృష్ణ, పచ్చూరు నరసయ్య నాయుడు, జనసేన నాయకులు జి.వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ సీజ్



సూళ్లూరుపేట, జూలై 31: పట్టణంలో అల్ షీరిస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను బుధవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ సీజ్ చేశారు. 10 రోజుల క్రితం ఆర్డీవో చంద్రముని అధికారులతో కలిసి పట్టణంలో హోటళ్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేపట్టి నిల్వ పదార్థాలు, అపరిశుభ్రంగా వాతావరణం ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. జీఎన్‌టీ రోడ్డులో ఆర్‌ఆర్ సూపర్ మార్కెట్ పక్కనే అల్ షీరిస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో నిల్వ మాంసం వినియోగిస్తున్నారని పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ మున్సిపాలిటీ సిబ్బందితో అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. నిబంధనల మేరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ లేకపోవడంతో సీజ్ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు మోగిన నగారా

చిత్తూరు (సెంట్రల్), జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలకు రాష్ట్ర విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా జారీ చేయనుంది. రెండేళ్ల కాలపరిమితితో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు అభ్యర్థుల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారు. 5న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలియజేయడం, ఫిర్యాదులుంటే పరిష్కరించడం చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటలకు తుది ఓటరు జాబితా ఖరారు, నోటీసు బోర్డులో ప్రదర్శన ఉంటుంది. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంది.

చిత్తూరు డీటీసీ డీఎస్పీ బదిలీ

చిత్తూరు, జూలై 31: డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను ఏలూరు నగర డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. కుప్పం డీఎస్పీగా ఉన్న శ్రీనాథ్ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్న పార్థసారథిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్!

- టీడీపీలోకి ఐదుగురు కౌన్సిలర్లు, 14 మంది ఎంపీటీసీలు జంప్
- సీఎం చంద్రబాబు సమక్షంలో చేరిక


టీడీపీలో చేరిన గుడుపల్లె మండల ఎంపీటీసీలు

కుప్పం, జూలై 31: కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన నియోజకవర్గంలోని 14 మంది ఎంపీటీసీలు, ఐదుగురు కౌన్సిలర్లు టీడీపీలోకి జంప్ అయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వారు పార్టీలో చేరి పసుపు కండువా కప్పుకొన్నారు. కుప్పం మున్సిపాలిటీకి చెందిన వైసీపీ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాలకు చెందిన ఎంపీటీసీలు మంగళవారం సాయంత్రం ఆయా మండలాల టీడీపీ నాయకులతో కలిసి విజయవాడకు చేరుకుని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిశారు. బుధవారం ఉదయం చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. ఇక్కడ వైసీపీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లకు చంద్రబాబు స్వయంగా పసుపు కండువాలు కప్పి, వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారితో సమావేశమయ్యారు. కుప్పం మున్సిపాలిటీకి చెందిన వైసీపీ కౌన్సిలర్లు రాజమ్మ, లావణ్య, హంస, సయ్యద్ అలీలు టీడీపీలో చేరారు. వీరిలో హంస, లావణ్య తరపున వారి భర్తలు, రాజమ్మ తరపున జగన్ చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే గుడుపల్లె మండలంనుంచి వైసీపీకి చెందిన సోడిగానిపల్లె ఎంపీటీసీ లక్ష్మీదేవి, కొడతనపల్లె ఎంపీటీసీ వసమ్మ, గుండ్లసాగరం ఎంపీటీసీ శ్రీకాంత్, కుప్పిగానిపల్లె ఎంపీటీసీ వెంకటేశ్, పొగురుపల్లె ఎంపీటీసీ రాజేశ్వరి, బెగ్గిలపల్లె ఎంపీటీసీ వెంకటమ్మ టీడీపీలో చేరారు. కుప్పం మండలంలో మల్లానూరు-3, జరుగు, నడిమూరు ఎంపీటీసీలు తిమ్మరాయన్, శ్రీనాథ్, నారాయణలు, శాంతిపురం మండలంలోని కడపల్లె, అనికెర, 121-పెద్దూరు, మఠం, చిన్నారిదొడ్డి ఎంపీటీసీలు ఉమాదేవి, వనిత, రవికుమార్, చంద్రప్ప, బీఎన్.వెంకటేశ్‌లు కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిలో మహిళా ఎంపీటీసీల తరపున చాలావరకు వాళ్ల కాక, వారి భర్తలు హాజరయ్యారు. త్వరలోనే కుప్పం నియోజకవర్గంలోని మరికొందరు ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు కూడా టీడీపీలో చేరనున్నట్టు చెబుతున్నారు. రామకుప్పం మండలంనుంచి మూడు నాలుగు రోజుల్లో వైసీపీ ఎంపీటీసీలు పెద్దయెత్తున టీడీపీలో చేరనున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేశ్‌బాబు, టీడీపీ కుప్పం మున్సిపల్, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, బాబునాయుడు, విశ్వనాథనాయుడు వీరితో పాటూ ఈ కార్యక్రమంలో ఉన్నారు.

కుప్పంలో సీను రివర్స్

హోటల్ అమరావతిగా మారుతున్న వైసీపీ అద్దె కార్యాలయం

కుప్పంలో సీను మారుతోంది. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు వెల్లువలా సాగుతున్నాయి. అందుకు సాక్ష్యం అన్నట్టుగా ఒకప్పుడు నీలి, పచ్చ రంగుల్లో, కార్యకర్తలతో కళకళలాడిన కుప్పం బైపాస్ రోడ్డులోని వైసీపీ కార్యాలయం.. హోటల్ అమరావతిగా కొత్తరూపం పోసుకుంటోంది. ఎన్నికల తర్వాత కార్యాలయం ఖాళీ అయిపోవడంతో భవన యజమాని ఉన్న భవనాలు కూల్చేసి హోటల్‌గా మార్చేస్తున్నారు. త్వరలో హోటల్ అమరావతి ప్రారంభం అంటూ ఫ్లెక్సీలు సైతం వేలాడదీశారు. ఆ దారిన వెళ్లేవారు మాత్రం ఈ మార్పు చూసి.. ఔరా.. ఎంతలో ఎంత మార్పు అని నిట్టూరుస్తున్నారు. - కుప్పం


అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు, శ్రేణులతో సందడిగా ఉన్న పార్టీ కార్యాలయం



ఇప్పుడు.. కార్యాలయం గేటుకు వేలాడదీసిన హోటల్ అమరావతి పేరిట ఫ్లెక్సీలు

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగించండి

నాడు ఈవో ధర్మారెడ్డి ఏకపక్షంగా తొలగించారు
హైకోర్టులో ఏవీ రమణ దీక్షితులు పిటిషన్
కౌంటర్ దాఖలుకు దేవదాయ ముఖ్యకార్యదర్శికి, టీటీడీ ఈవోకు హైకోర్టు ఆదేశాలు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఏవీ రమణదీక్షితులు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యం పై విచారణ జరిపిన న్యాయస్థానం, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శి, టీటీడీ ఈవోకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ ఈ ఏడాది మార్చి 2న అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను ఏవీ రమణదీక్షితులు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్ వాదనలు వినిపించారు. "పిటిషనర్‌కు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా టీటీడీ ఈవో అప్పట్లో వ్యవహరించారు. ఈవో ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి రమణదీక్షితులు ప్రధాన అర్చకుడిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలి" అని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

హామీలను అమలు చేస్తాం: పాశిం

గూడూరు, జూలై 31: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా సీఎం చంద్రబాబు చర్య లు చేపట్టారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నా రు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రూ.3వేల పెన్షన్‌ను రూ.1000 పెంచి రూ. 4వేలను లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందిస్తున్నా రన్నారు. ఈనెల 1న గురువారం ఉదయం 6గంటల నుంచే పింఛను పం పిణీ చేస్తారన్నారు. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నా మన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం జరుగుతోందని త్వరలోనే కార్యరూపం దాలుస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలో సిలికా, ఇసుక మైనింగ్‌లో జరిగిన అక్రమాలపై అధికారుల విచారణ జరు గుతోందని, త్వరలోనే నిజాలను నిగ్గుతేలుస్తామన్నారు. భాస్కర్‌రెడ్డి, చాన్ బాషా, చెంచురామయ్య, శివకుమార్, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వరు ్లనాయుడు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువల అభివృద్ధికి చర్యలు

గూడూరు, జూలై 31: పట్టణంలో ము రుగునీరు సక్రమంగా పారేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ వెంక టేశ్వర్లు అన్నారు. బు ధవారం పట్టణం లోని పలు వీధుల్లో కాలువలను సిబ్బందితో కలిసి పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వర్షపునీరు సజావుగా ప్రవహించేలా ప్రధాన కాలువల్లో పూడికతీతకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. పలు వార్డుల్లో దుస్థితికి చేరిన కాలువలను గుర్తించి వాటికి మరమ్మతులు చేపడుతామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు, వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గూడూరు, జూలై 31: పట్టణంలోని చవటపాళెం ప్రభుత్వ ఉన్న పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకులు ఎంఈవో కా ర్యాలయంలో ఎంఈవో కాంచనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... తాగునీటి సమస్య కారణంగా మధ్యాహ్నం భోజనం సక్రమంగా చేయడం లేదన్నారు. ఇంద్రవర్ధన్, చంద్రనీల్, రాజశేఖర్, విష్ణు, ప్రసాద్, అవినాష్, కోటి, మురళి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు వెళ్లేలా చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, జూలై 31: స్థానిక శ్రామికనగర్‌లో మురుగునీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరిగి ధర్నాలో వారు మాట్లాడుతూ... శ్రామికనగర్‌లో మురుగు నీరు బయటకు వెళ్లే ప్రాంతంలో ఓ ప్రైవేటు కళాశాల నిర్వాహకులు గోడను నిర్మించారన్నారు. దీంతో మురుగు ముందుకు కదలక నిల్వచేరడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. శివకుమార్, శ్రీనివాసులు, బీవీరమణయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్ల క్రితం నిర్మించాం

కళాశాలలో విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా కొందరు వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నట్టు కలశాల యాజమాన్యం ప్రకటించింది. కళాశాలలో 8 ఏళ్ల క్రితమే ప్రహరీ నిర్మించినట్టు పేర్కొంది. అయితే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గోడను ధ్వంసం చేయడం కారణంగా మురుగునీరు కళాశాల ఆవరణలోకి వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

గూడూరు డీఎస్పీ బదిలీ


సూర్యనారాయణరెడ్డి

గూడూరు అర్బన్, జూలై 31: గూడూరు డీఎస్పీగా పనిచేస్తున్న సూర్యనారాయణరెడ్డిని బుధవారం బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేశారు. ఈ క్రమంలో గూడూరు డీఎస్పీగా పని చేస్తున్న సూర్య నారాయణరెడ్డిని విజయవాడ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల సమయంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అప్పట్లో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఎన్నికల అధికారులు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

నేడు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గూడూరు అర్బన్, జూలై 31: స్థానిక త్యాగరాజవీధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శుక్రవారం సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపండి

నాయుడుపేట టౌన్, జూలై 31: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు బుధవారం ఎస్ఐ గోపీకి వినతిపత్రం అంద జేశారు.

ఉపాధి హామీ పని దినాలు పెంచండి

తడ, జూలై 31: ఉపాధి హామీ పని దినాలను నిర్ణయించిన లక్ష్యం ప్రకారం పూర్తి చేసేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీడీవో విజయ్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూలీలకు కనీస వేతనం రూ.300 అందేలా పనులు చేయించాలన్నారు. అలాగే బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని ఆయన ఆదేశించారు. ఏపీవో విజయభాస్కర్ పాల్గొన్నారు.

తిరుమలలో సచివాలయానికి భూమిపూజ

తిరుమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల స్థానికులు నివాసముండే బాలాజీనగర్‌లో సచివాలయ భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం భూమిపూజ చేశారు. ప్రస్తుతం తిరుమలలోని డీటైప్ క్వార్టర్స్‌లో తాత్కాలికంగా సచివాలయం ఉన్న విషయం తెలిసిందే. బుధవారం కూటమి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్‌తో కలిసి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమల, తిరుపతి స్థానికులకు సంబంధించిన 19 సమస్యలపై టీటీడీ ఈవోతో చర్చించామన్నారు. ఇక టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన నేతలు రాజారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి భక్తులకు మెరుగైన సేవలు

శ్రీకాళహస్తి, జూలై 31: ముక్కంటి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ముక్కంటి ఆలయంలోని పరిపాలన భవనంలో బుధవారం ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, అధికారులతో కలిసి అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా అభివృద్ధి చేయాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ముక్కంటి ఆలయ ప్రతిష్ఠను ప్రపంచ నలుమూలలకు విస్తరించేలా కసరత్తు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా భక్తులకు అవసరమైన అన్ని వసతులపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి ముక్కంటి ఆలయానికి చేరుకునేందుకు భక్తుల కోసం ఉచిత బస్సులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తుల కోసం డిజిటల్ నగదు లావాదేవీలు ప్రారంభిస్తామన్నారు. అంతేకాకుండా రాహుకేతు పూజలతో పాటు దర్శనం, వసతి టిక్కెట్లను విమానాశ్రయంలో భక్తులు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఆలయంలో ఉక్కపోత సమస్య పరిష్కరించేందుకు తిరుమల తరహాలో సెంట్రల్ ఏసీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. ముక్కంటి ఆలయంపై ప్రతినెలా రూ.9లక్షల విద్యుత్ భారం పడుతోందని, దీనికి ప్రత్యామ్నాయంగా ఎకరా స్థలంలో 1.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును నెలకొల్పబోతున్నామని తెలిపారు. పూణేకు చెందిన వెంకీస్ సంస్థ నిర్వాహకులు రూ.5కోట్ల సొంత నిధులతో పూర్తిగా పురాతన విధానంతో ముక్కంటి ఆలయ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పైకప్పుకు మరమ్మతులు చేయడం అభినందనీయమన్నారు. ఇక పొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలను సంప్రదించి ఆయా రాష్ట్రాల పేరుతో శ్రీకాళహస్తిలో ప్రత్యేక భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే అతిప్రాచీనమైన గుడిమల్లం శివాలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

వేధింపులు మానకుంటే ఉద్యమం ఉధృతం



నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు

శ్రీకాళహస్తి, జూలై 31: వేధింపు మానకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని స్కీం వర్కర్లు హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద బుధవారం సీఐటీయూ అనుబంధ సంఘాల స్కీం వర్కర్లు, నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ అనుబంధ అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరుద్యోగులను రాజకీయ వేధింపులకు గురిచేయడం తగదన్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గలో అధికార పార్టీ నేతలు స్కీమ్ వర్కర్లను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. వారికి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సహకరించడం సిగ్గుచేటన్నారు. ఇటీవల శ్రీకాళహస్తి మండలంలో మన్నవరం, ఎంపేడు అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక అధికార పార్టీ నేతల వేధింపులు తాళలేక ఆస్పత్రి పాలైతే సీడీపీవో పరామర్శించలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, ఆశ వర్కర్ల జిల్లా గౌరవాధ్యక్షురాలు లక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ధనమ్మ, బాగ్యలక్ష్మి, రేవతి, సౌజన్య, రేవతి, సీఐటీయూ నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి, హరినాథ్, రంగయ్య, సంక్రాంతి వెంకటయ్య, నాగరాజు, వెంకటేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

టీసీఎల్ ఉద్యోగిని ఆత్మహత్య



గౌతమి (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, జూలై 31: ఏర్పేడు మండలం వికృతమాల రెవెన్యూ పరిధిలో ఉన్న టీసీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న ఓ మహిళ బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.... తిరుపతికి చెందిన గౌతమి (31) నాలుగేళ్లుగా టీసీఎల్ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తోంది. కంపెనీ సమీపంలో ఉన్న మునగలపాళెం గ్రామానికి చెందిన సురేంద్ర బాబును రెండేళ్ల క్రితం వివాహం చేసుకుంది. వీరికి పిల్లలు లేరు. గౌతమి మునగలపాళెం నుంచి బుధవారం టీసీఎల్‌కు వెళ్లింది. పరిశ్రమ లోపల విషం తాగి కుప్పకూలిపోయింది. టీసీఎల్ అధికారులు ఆమెను అమర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. పోలీసుల విచారణలో మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పాముకాటుతో వ్యవసాయ కూలీ మృతి

ఏర్పేడు, జూలై 31: మండలంలోని అముదూరు దళితవాడకు చెందిన ఎల్లయ్య(55) పాముకాటుతో బుధవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన రైతు పొలంలో వేరుశనగ ఒబ్బిడి చేసే పనికి వెళ్లిన ఎల్లయ్య పాముకాటుకు గురయ్యాడు. మొదట స్థానికంగా నాటు వైద్యం చేయించుకుని, ఆ తరువాత ఎంపేడు పీహెచ్‌సీకి, అక్కడి నుంచి వెంకటగిరి ఆస్పత్రికి వెళ్లారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళుతుండగా మృతి చెందాడు.

ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించండి

సత్యవేడు, జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేసుకోవాలని ఎంఈవో రవి ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 1వ తేదీన ఎస్ఎంసీ మెంబర్లు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసి, పాఠశాలల వద్ద నోటీస్ బోర్డులో ఓటరు జాబితాను ఉంచనున్నట్లు తెలిపారు. 5వ తేదీ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. 8వ తేదీ సభ్యుల ఎన్నిక అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుని వారిచేత ప్రతిజ్ఞ చేయించి, తొలి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

రమేష్ చంద్రప్రసాద్ మృతి తీరని లోటు



గంధమనేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 31: టీడీపీ సీనియర్ నేత, ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటు అన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం నిండ్ర మండలం ఒరూరుపేటలోని రమేష్ చంద్రప్రసాద్ స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత చెంచయ్య నాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చిలుక వాహనంపై చెంగల్వరాయస్వామి పురవిహారం



శ్రీకాళహస్తి, జూలై 31: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఉదయం చిలుక వాహనంపై ఊరేగారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి అమ్మవార్లను చిలుక వాహనంపై అధిష్ఠించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి డీఎస్పీ బదిలీ

శ్రీకాళహస్తి, జూలై 31: శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి పోలీస్‌శాఖ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

బాలిక అదృశ్యం

ఏర్పేడు, జూలై 31: ఏర్పేడు మండలం సరస్వతికండ్రిగ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు బుధవారం సాయంత్రం సీఐ శ్రీరామ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. గత రెండు రోజులుగా తమ కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సుజనా చౌదరికి స్వాగతం



సుజనా చౌదరితో టీడీపీ నాయకులు

ఏర్పేడు, జూలై 31: బీజేపీ నాయకుడు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరికి టీడీపీ నాయకులు పేరం రమేష్ నాయుడు, సత్రవాడ ప్రవీణ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, బీజేపీ నేత కోలా ఆనంద్ తదితరులు స్వాగతం పలికారు. బుధవారం పుత్తూరుకు వెళ్తున్న ఆయనను గాజులమండ్యం సర్కిల్‌లో కలిసి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనండి

పిచ్చాటూరు, జూలై 31: సత్యవేడు నియోజకవర్గంలోని ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు గురువారం అందజేసే సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. సచివాలయ ఉద్యోగులతో కలిసి కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు గురువారం ఉదయం 6గంటల నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేయాలన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ప్రారంభం

శ్రీకాళహస్తి, జూలై 31: తొట్టంబేడు మండలంలో పెద్దకన్నలి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నూతన స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మాధవయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పీడీ శివరంజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ వార్డు మెంబర్

రేణిగుంట, జూలై 31: వైసీపీకి చెందిన వార్డు మెంబర్ మహబూబ్‌బాషా జనసేన పార్టీలో చేరారు. బుధవారం రేణిగుంట పట్టణంలో పార్టీ కార్యాలయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రబాబు, భాస్కర్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 31: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు తలారివెట్టుకు చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి, రైల్వే ఉద్యోగి పూర్ణచంద్ ఒక్కొక్కరికి రూ.2వేల నగదు అందజేశారు. హెచ్ఎం రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్‌బాబు, నాదెండ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం: ఆదిమూలం



సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, జూలై 31: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే సీఎం చంద్రబాబు ఒక్కొక్క హామీని నెరవేరుస్తూ చరిత్రాత్మక పాలనకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. బుధవారం మదనంబేడు సచివాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం అధికారులకు సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల పాలిట గుదిబండలా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయడమే కాకుండా, జగనన్న భూహక్కు పేరుతో పాసు పుస్తకాలపైన జగన్ బొమ్మను తొలగించి ఆంధ్రప్రదేశ్ రాజముద్రను ముద్రించిన పాసు పుస్తకాలను పంపిణీ చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు పరమశివం, జనసేన మండల అధ్యక్షుడు రూపేష్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి, చిన్న, బాల మురళి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి వేగవంతం

వరదయ్యపాళెం, జూలై 31: టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 50రోజుల్లోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనుల్లో వేగం పెరిగిందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం ఆయన వరదయ్యపాళంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ముందడుగు వేయడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, వైద్య, విద్యాశాఖలో ఎన్నో మార్పులు తీసుకురావడం శుభపరిణామమని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు సంక్షేమ పథకాలు అందేలా చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నిర్మల్, నాగరాజు యాదవ్, రమేష్‌రెడ్డి, రాజేంద్ర నాయుడు, అజయ్, పవన్ నాయుడు, మహేష్, రమణయ్య, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ఏర్పేడు, జూలై 31: ఏర్పేడు మండలం మోదుగులపాళెం కొత్తవీరాపురం వద్ద స్వర్ణముఖి నదినుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. బుధవారం కొంతమంది స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో డీటీ శ్రావణ్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. స్వర్ణముఖిలో నుంచి ఇసుకను తరలించడానికి ప్రభుత్వ అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఏర్పేడు మండలంలో ఇసుక రవాణా విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని మోదుగులపాళెం, మడిబాక గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు చెప్పారు. స్వర్ణముఖిలో ఇసుక తవ్వకం వల్ల భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లు ఎండిపోతాయని చెప్పారు.

గిరిజన విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 31: మండలంలోని మొక్కలచేను గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలోని గిరిజన విద్యార్థులకు పుత్తూరుకు చెందిన సంజీవ సింహ ట్రస్టు అందించిన నోటు పుస్తకాలను ఎంఈవో రవీంద్రనాథ్, వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి

కేవీబీపురం, జూలై 31: మండలంలోని కొట్టాలమిట్ట ఎస్టీకాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితిలో ఉంది. పిచ్చాటూరు - శ్రీకాళహస్తి ప్రధాన రహదారి నుంచి 1.5 కిలోమీటరు దూరం ఉన్న ఈ రోడ్డు రాళ్లు తేలి నడవడానికి వీలులేకుండా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలం ఈ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు చేపట్టక పోవడంతో రోడ్డు రాళ్లు తేలిపోయింది. అధికారులు స్పందించి కొట్టాలమిట్ట రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కమనీయం... కుమారస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకారంలో శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి

శ్రీకాళహస్తి, జూలై 31: శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి కల్యాణం బుధవారం రాత్రి కమనీయంగా సాగింది. శ్రీకాళహస్తి పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అక్కడ నుంచి మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య కుమారస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈవేడుకలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, విద్య తప్పనిసరి



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, జూలై 31: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, విద్య తప్పనిసరి అని శ్రీకాళహస్తి న్యాయస్థాన 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని తుఫాన్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు వారి హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రతి ఇంట్లో ఆరోగ్యం, విద్య తప్పనిసరిగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమలో పోలీసుశాఖ అధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, ఏరియా ఆస్పత్రి వైద్యులు, తుఫాన్‌సెంటర్ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీసిటీ ఆక్సిలెంట్ ఫార్మాకు ప్రతిష్టాత్మక సర్టిఫికెట్



శ్రీసిటీ, జూలై 31: శ్రీసిటీలోని ఆక్సిలెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యునైటెడ్ స్టేట్స్ ఫుడ్ అండ్(యూఎస్ ఎఫ్‌డీఏ) నుంచి ప్రతిష్టాత్మక ఎస్టాబ్లిష్ మెంట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్(ఈఐఆర్) సర్టిఫికెట్ అందుకుంది. ఈ సంస్థ జూన్ నెలలో పరిశ్రమను సందర్శించి నాణ్యత తనిఖీలు నిర్వహించింది. ఈఐఆర్ సర్టిఫికెట్ అందుకోవడం తమ సంస్థకు ఎంతో గర్వకారణమని ఆక్సిలెంట్ ఫార్మా చైర్మన్ జితేష్ దేవేంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నైలో ప్రధాన కార్యాలయం కలిగి ఉన్న ఆక్సిలెంట్ ఫార్మా సంస్థ శ్రీసిటీలో భారీ ఉత్పత్తి కేంద్రం నెలకొల్పి రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది.

పిల్లలకు వాహనాలు ఇస్తే చర్యలు

శ్రీకాళహస్తి, జూలై 31: మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పట్టణంలోని రామసేతు వంతెన వద్ద బుధవారం వన్‌టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడుపుతుండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లలకు వాహనాలు ఇస్తే ద్విచక్ర వాహనం సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పుత్తూరు వార్తలు

ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంకండి

పుత్తూరు టౌన్, జూలై 31: కార్మికులు ఐక్యంగా ఉండి, ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుత్తూరు డివిజన్ ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. టీఎస్‌టీయూసీ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా హేమావతి, ప్రధాన కార్యదర్శిగా గోపి, ఉపాధ్యక్షులుగా విజయ్ కుమార్, మారెమ్మ, ధనలక్ష్మి, సుబ్రమణి, ఇందిర, శరవణ, సహాయ కార్యదర్శులుగా కైలాసం, శీను, రాకేష్, గిరి, తులసి, రమణమ్మ, రమేష్, కోశాధికారిగా గణేష్, కౌన్సిల్ సభ్యులుగా కృష్ణారెడ్డి, కోదండపాణి, రవి, సరిత, సెల్వరాజ్ ఆచారి ఎన్నికయ్యారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు మహేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

గ్రామదేవతలతో పల్లెసీమలు సస్యశ్యామలం



గంగమ్మ పూజల్లో గాలి భానుప్రకాష్

వడమాలపేట, జూలై 31: గ్రామదేవతలను పూజించడం ద్వారా పల్లె సీమలు సస్యశ్యామలంగా ఉంటాయని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. బుధవారం వడమాల పేట మండలంలోని గొల్లకండ్రిగలో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా గ్రామదేవతలకు పూజలు చేసి, జాతర నిర్వహించడం వల్ల సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉంటారన్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, నాయకులు జగన్నాధం, శోభనాద్రి, ఆదెయ్య, షణ్ముగం, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, దేవి, వెంకటముని పాల్గొన్నారు.